క్లుప్తంగా

200 మంది రక్తదానం



సప్తగిరి హేచరీస్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సత్తి సూర్యనారాయణరెడ్డి

తొండంగి: ప్రముఖ పారిశ్రామిక వేత్త, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా కొత్తపోడిపల్లిపేట శివారు సప్తగిరి హేచరీస్‌లో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సుబ్బారెడ్డి తనయుడు జాతీయ ఉత్తమ హేచరీస్ అవార్డు గ్రహీత, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణరెడ్డి (పెదబాబు) ప్రారంభించారు. తొండంగి మండలానికి చెందిన యువత, అభిమానులు సుమారు 200 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. తొలుత సప్తగిరి హేచరీస్‌లో సత్తి సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. రక్తదానం చేసిన యువకులను పలువురు అభినందించారు.

ఆదిత్యలో ముగిసిన వర్క్‌షాప్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య సివిల్ విభాగంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు రిసోర్స్ పర్సన్ మోహన్ బలగా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు స్ట్రక్చరల్ డిజైన్‌లో అభివృద్ధి, నూతన టెక్నాలజీపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయన్నారు. ఐదులరోజుల పాటు వర్క్‌షాపు విజ్ఞానదాయకంగా సాగిందని సివిల్ విభాగాధిపతి రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ బి.రామ్‌సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అండగా నిలిచిన యువకులు



పెద్దిపాలెంలో వృద్ధురాలికి సహాయాన్ని అందజేస్తున్న యువకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం శెట్టిబలిజపేటలో వృద్ధురాలికి యువకులు అండగా నిలిచారు. స్థానిక పీడీవై హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధురాలికి బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలతో పాటు ఆర్థిక సహాయం చేశారు. గ్రామంలో పేదలకు ఏ కష్ట వచ్చినా సహాయం చేసేందుకు ముందుంటామని యువకులు తెలిపారు. వృద్ధురాలికి అండగా నిలిచిన యువకులను గ్రామ పెద్దలు అభినందించారు.

బొద్దవరంలో 'గృహసారథులతో గడప గడపకూ మన సర్పంచ్'



బొద్దవరంలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: మండలంలోని బొద్దవరంలో 'గృహసారథులతో గడపగడపకూ మన సర్పంచ్' కార్యక్రమానికి ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ వేగి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి, మంత్రి దాడిశెట్టి రాజాకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ 50 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటామని సర్పంచ్ లక్ష్మి తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

తుని: ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ ఉంటుందని, దానిని అందిపుచ్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడిశెట్టి విష్ణుచక్రం అన్నారు. స్థానిక అక్షర పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం విశాఖపట్నానికి చెందిన గణేష్ ఐఐటీ, మెడికల్ అకాడమీ, జూనియర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. తుని, పాయకరావుపేటలో వివిధ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాడిశెట్టి విష్ణుచక్రం ప్రోత్సాహక బహుమతులు, నగదును అందజేశారు. గణేష్ విద్యాసంస్థల చైర్మన్ గణేష్, కో ఆర్డినేటర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ చైతన్య, ఏవో సన్యాసిరావు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం

- తుని ప్రభుత్వ ఆసుపత్రికి దాతల విరాళాల వెల్లువ
- రెండేళ్లలో రూ.85 లక్షల వితరణ
- సమకూరిన ఆధునిక సౌకర్యాలు



గెయిల్ సంస్థ సమకూర్చిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి(ఫైల్)



రామకృష్ణ సేవాసమితి అందించిన కోవిడ్ పరికరాలు (ఫైల్)



ఆసుపత్రి శత వార్షికోత్సవంలో దాతను సత్కరిస్తున్న మంత్రి రాజా, కలెక్టర్ కృతికా శుక్లా

తుని: సంపాదనే పరమావధిగా కొందరు జీవిస్తారు. మరికొందరు సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు ఖర్చు చేయాలని పరితపిస్తారు. ఈ రెండింటికి ఉన్న తేడాను గమనించలేక యాంత్రిక జీవితానికి అలవాటు పడి చివరకు జీవిత గమ్యానికి చేరుకోలేరు. కరోనా మహమ్మారి సమయంలో అభాగ్యులకు మేము ఉన్నామంటూ ఎందరో దాతలు ఆపన్నహస్తం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెండేళ్లలో మనసున్న మారాజులు అందించిన సేవలు వెలకట్టలేనివి. కరోనా ప్రభావం తగ్గిన తరువాత కూడా దాతలు ఆసుపత్రి విరాళాలు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

మంత్రి దాడిశెట్టి రాజా స్ఫూర్తితో..

గత ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిని ఆదాయ వనరుగా వాడుకున్నారు. వైద్య విధాన పరిషత్ ద్వారా వచ్చే నిధులు తప్ప ఒక్క రూపాయి కూడా దాతల ద్వారా వచ్చేది కాదు. తుని ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి దాడిశెట్టి రాజా కరోనా సమయంలో మానవత్వాన్ని చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎందుకంటే ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లకు మాత్రమే డైట్ ఇచ్చేవారు. రోగులకు సహాయంగా వచ్చే వారు నరకయాతన అనుభవించిన సంఘటనలు కోకొల్లలు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో ఉన్న రాజా కొత్త ఆలోచన చేశారు. కరోనా సమయంలో డబ్బులు వెచ్చించినా ఆహారం దొరకని పరిస్థితిని మనం చూశాం. ఇది గమనించిన ఆయన ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులకు తానే ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. రోజుకు 400 మందికి మూడు పూట్ల ఆహారం అందించారు. ఇది గమనించిన ఎందరో దాతలు మనం దాతృత్వంలో భాగ స్వామ్యులు అవుదామని ముందుకు వచ్చారు. దీని ప్రతిఫలంగా రెండేళ్లలో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ.85 లక్షల విలువ చేసే పరికరాలు ఉచితంగా సమకూరాయి.

ప్రజలకు అధునాతన వైద్య సేవలు

కరోనా సమయంలో జిల్లా ఆసుపత్రికి సమానంగా తుని ఏరియా ఆసుపత్రిలో సేవలు అందించారు. కరోనా పాజిటివ్ రోగులకు అవసరమైన ఆక్సిజన్‌తో పాటు డాక్టర్లు, సిబ్బందికి అవసరమైన గ్లౌజుల నుంచి అన్ని రకాల సామగ్రిని దాతలు అందించారు. తుని, ప్రత్తిపాడు, పాయకరావుపేట నియోజక వర్గాలకు చెందిన వందలాది మంది రోగుల ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని విభాగాల్లోనూ రాష్ట్రంలో అగ్రగామిగా ఉంది.

దాతలకు సత్కారం

ఆసుపత్రికి ఇతోధికంగా సహాయం చేసిన దాతలను ఆసుపత్రి శత వార్షిక వేడుకలను పురస్కరించుకొని ఇటీవల మంత్రి దాడిశెట్టి రాజా ఘనంగా సత్కరించారు. స్థల దాతలతో పాటు లక్షలు విలువ చేసే సామగ్రిని ఉచితంగా ఇచ్చిన అందిరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో డెక్కన్, అరబిందో ఫార్మ కంపెనీల తరఫున రూ.65 లక్షలు అందించారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలను సమకూర్చారు.

ఆసుపత్రికి విరాళం అందించిన దాతల వివరాలు

దాత	అందించిన సాయం
1.డెక్కన్ మందుల కంపెనీ డైరెక్టర్ వెంకటలక్ష్మీపతిరాజు	రూ.లక్షల విలువైన పరికరాలు, ఒక అంబులెన్స్
2.అరబిందో ఫార్మా	రూ.30 లక్షలు, కంప్యూటర్లు, చైల్డ్‌కేర్ యూనిట్లు, రక్త పరీక్ష యంత్రాలు
3.గెయిల్ సంస్థ	రూ.4 లక్షలు, మినరల్ వాటర్ ప్లాంట్
4.రామకృష్ణ సేవా సమితి	రూ.8 లక్షలు, కోవిడ్ పరికరాలు

దాతల సేవలు వెలకట్టలేం



ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలకు సంబంధించిన పరికరాలను దాతలు ఉచితంగా అందించారు. నవజాత శిశువు సంరక్షణ నుంచి రక్త పరీక్షల వరకూ లక్షలు విలువ చేసే అధునాతన మెషినరీని సమకూర్చారు. వైద్యులపై ఒత్తిడి లేకుండా మంత్రి రాజా అన్ని సదుపాయాలు కల్పించారు.

– స్వప్న, సూపరింటెండెంట్, తుని ప్రభుత్వ ఆసుపత్రి

రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు



ఆసుపత్రికి అవసరమైన అన్ని రకాల పరికరాలను దాతలు అందించారు. రోగులకు ఇబ్బంది లేకుండా మంచి వైద్యంతో పాటు ఉచితంగా రుచికరమైన భోజనం అందించాం. ప్రజల కోసం ఉదారత చాటిన అందరిని సత్కరించి రుణం తీర్చుకున్నాం. పాలకుడు మంచి వ్యక్తి అయితే ప్రజలు సంతోషంగా ఉంటారు.

– దొరబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, తుని

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



సూర్య నమస్కారాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో స్వామి వారికి సూర్యనమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడిగా గాంధీ



సత్రం నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న గౌరవాధ్యక్షుడు తాతబాబు

అన్నవరం: స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి నిత్యాన్నదాన సత్రం (ఆర్యవైశ్యసత్రం) అధ్యక్షుడిగా పేరూరి గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్రం గౌరవాధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ (తాతబాబు) అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సత్రం అధ్యక్షుడిగా గాంధీ పేరును సభాధ్యక్షుడు బచ్చు రాజబాబు ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యదర్శిగా డాక్టర్ రేపాక రామ సత్యనారాయణ, కోశాధికారిగా తల్లం సత్యారావులను ఎన్నుకున్నారు. సత్రం కార్యదర్శిగా సుమారు 20 ఏళ్లుగా సేవలందిస్తున్న పేరూరి గాంధీ అధ్యక్షుడిగా ఎన్నికకావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రత్నగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు పేరూరి బద్రీనారాయణను ఘనంగా సత్కరించారు.

గోతులు.. భక్తులకు వెతలు



షెడ్డు నిర్మాణం పేరుతో రోడ్డు మీద గోతులు తవ్వి రాకపోకలు నిలిపివేసిన దృశ్యం



చుట్టూ తిరిగి వెళ్లలేక గోతుల పక్క నుంచి నడిచి వెళుతున్న భక్తులు



కేశఖండనశాల పక్కనున్న మెట్ల దారిలో నడిచి వస్తున్న భక్తులు

- రత్నగిరి పశ్చిమ రాజగోపురం రోడ్డుపై మళ్లీ గోతులు తవ్విన అధికారులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు

అన్నవరం: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందనేది పాత సామెత. సత్యదేవుని పశ్చిమరాజగోపురం రోడ్డు వద్ద నిర్మిస్తున్న విశ్రాంతి షెడ్డు పనులు భక్తులకు అవస్థలను తెచ్చాయనేది కొత్త సామెత. ప్రతిసారి భక్తులు ఎక్కువగా వచ్చే సీజన్‌లోనే ఈ రోడ్డును తవ్వేసి వాహనాల రాకపోకలను నిలిపి భక్తులను నరకయాతనకు గురిచేయడం అధికారులకు ఆనవాయితీగా మారింది. గత జనవరి నెలలో ప్రారంభమైన ఈ షెడ్డు నిర్మాణం రోడ్డును తవ్వి గోతులు తీయడం వరకే వచ్చింది తప్ప పెద్దగా ముందుకు సాగడం లేదు. గతంలో గోతులు తవ్వి వదిలేయడంతో 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు రోడ్డుపై ఆ గోతులు పూడ్చి భక్తులు నడిచేందుకు ఏర్పాట్లు చేశారు.

పెళ్లిళ్ల సీజన్ కావడంతో.. : గత నాలుగు రోజులుగా వివాహ ముహూర్తాలు ఉండడంతో సత్యదేవుని ఆలయానికి భారీగా పెళ్లిళ్ల జనాలు తరలివస్తున్నారు. ఇదే అదును అనుకున్నారో ఏమో మరలా రోడ్డు మీద గోతులు తవ్వేసి సిమెంట్ కాంక్రీట్ కుఏర్పాట్లు చేస్తున్నామని చెబుతున్నారు. అలా అని ఆ పనులన్నా వేగంగా జరుగుతున్నాయా అంటే అదీ లేదు. కాగా భక్తులు పశ్చిమ రాజగోపురం వద్దకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లడమో లేక కేశఖండన శాల పక్కన గల మెట్ల నుంచి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. కొంతమంది భక్తులు కాస్తం ధైర్యం చేసి ఆ గోతులను తప్పించుకుంటూ వెళుతున్నారు. వివాహాల సీజన్ పూర్తయ్యే వరకూ షెడ్డు పనులు నిలిపివేయాలని, లేకుంటే పగలూ, రాత్రి తేడా లేకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా కొండరాజులుబాబు పండగ



ఉత్తరకంచిలో కొండ రాజులబాబును దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జి.కొత్తపల్లిలో అడవిరాజులబాబును దర్శించుకున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచిలో కొండరాజులుబాబు పండగ ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామ శివారు పొలాల్లో వేంచేసిన కొండ రాజులుబాబును అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, అన్నవరం ట్రస్టుబోర్డు సభ్యుడు దోె చిట్టిబాబు, ఎంపీటీలు ఉమ్మిడి తాతీలు, తటవర్తి రామన్నదొర, సర్పంచ్ ఏపూరి రామారావు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు గొల్లపల్లి దొరబాబు తదితరులు భక్తులకు సేవలందించారు.

జి.కొత్తపల్లిలో..

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో అడవి రాజులుబాబు పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పంటలు సంవృద్ధిగా పండి రైతులకు ఆదాయ మార్గాలు చూపాలని స్వామివారిని కోరుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుడు కనిగిరి శేషయ్య, చక్రమ్మ, సర్పంచ్ ఈగల విజయదుర్గ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేదెప్పుడో ?



గాంధీ విగ్రహం వద్ద నిరుపయోగంగా ఉన్న సిమెంట్ దిమ్మ

ఏలేశ్వరం: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలిచింది స్థానిక షిర్డీ నగర్‌లోని సిమెంట్ దిమ్మ. షిర్డీనగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీప ప్రాంతవాసులు గత కొంతకాలంగా లో వోల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ప్రజలు తమ సొమ్ముతో సిమెంట్ దిమ్మ నిర్మించుకోవాలని కండీషన్ పెట్టారు. చేసేది లేక ఆ ప్రాంత ప్రజలు సుమారు రూ.40 వేలతో సిమెంట్ దిమ్మను నిర్మించుకున్నారు. దిమ్మ నిర్మించి రెండేళ్లు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకుండా ట్రాన్స్‌కో అధికారులను కాలయాపన చేస్తున్నారు. వేసవికాలం సమీపిస్తుండడంతో లో వోల్టేజీ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య కళాశాలల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

గండేపల్లి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఛాంపియన్ ట్రోఫి క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ టోర్నీలో మొత్తం 82 టీమ్‌లు పాల్గొంటున్నాయని, విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.12000, నగదు బహుమతి, మెమెంటో, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.8000, మెమెంటో అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 13 మంది అరెస్టు

జగ్గంపేట: గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 13 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.37 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. స్థానిక గోకవరం రోడ్డులోని పోలవరం కాలవకు సమీపంలో ఉన్న గెస్ట్‌హౌస్‌లో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ1.30 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే జగ్గంపేట లారీ యూనియన్ ఆఫీసు వెనుక రహస్యంగా పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.7200 స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

దివ్య వచ్చినా.. అంతా నేనే..

- నియోజకవర్గ ఇన్‌చార్జి పరిచయ సభలో యనమల కృష్ణుడు
- రామకృష్ణుడు ఉన్నా రాజకీయమంతా తనదేనన్న టీడీపీ నేత



కృష్ణుడిని అభినందిస్తున్న నాయకులు

తుని రూరల్: యనమల రామకృష్ణుడు గతంలో మంత్రి అయినప్పటికీ.. ఇక్కడ అంతా తానే అన్నట్టుగా రాజకీయం చేశానని ఆయన సోదరుడు, స్థానిక టీడీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన యనమల దివ్య పరిచయ కార్యక్రమాన్ని ఎస్.అన్నవరం శివారు సాయి వేదికలో ఆదివారం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన కృష్ణుడు మాట్లాడుతూ, నియోజకవర్గ ఇన్‌చార్జిగా దివ్య వచ్చినప్పటికీ.. కార్యకర్తలకు, నాయకులకు తానే అండగా ఉంటానని అన్నారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేత రామకృష్ణుడు మాట్లాడుతూ, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ప్రాణాలను హరించేలా కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలను మూసివేస్తామని అన్నారు. కార్యకర్తలపై కేసులన్నింటిని ఒక్క కలం పోటుతో తొలగిస్తామన్నారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చుతానని, అందుకు అందరూ సహకరించాలని దివ్య కోరారు. యనమల కృష్ణుడిని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించినట్టు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, బండారు సత్యనారాయణమూర్తి, వనమాడి కొండబాబు, పెందుర్తి వెంకటేష్, వరుపుల రాజా, సుర్ల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పందుల్లో స్వైన్ ఫీవర్‌కు వ్యాక్సిన్

జగ్గంపేట: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పందులు స్వైన్ ఫీవర్ బారిన పడి మృతి చెందుతున్నాయి. వందల సంఖ్యలో పందులు చనిపోతూండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జగ్గంపేట పంచాయతీలో ఇప్పటి వరకూ 400 పైగా పందులు మృతి చెందినట్టు ఈఓ గణేష్ తెలిపారు. చనిపోయిన పందులను ఊరి చివరన పెద్ద గోతులు తవ్వి ఖననం చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పందులు స్వైన్ ఫీవర్ బారిన పడి, ఒక్క రోజులోనే మృతి చెందుతున్నట్టు గుర్తించామని జిల్లా పశు సంవర్ధక అధికారి సూర్యప్రకాశరావు చెప్పారు. వ్యాధి నివారణకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, పందుల మృతి వల్ల ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలూ రావని, ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి 10 వేల డోసుల స్వైన్ ఫీవర్ నివారణ వ్యాక్సిన్ రప్పించామని తెలిపారు. ఇప్పటికే 4 వేల డోసుల వ్యాక్సిన్ వివిధ ప్రాంతాల్లో పందులకు వేశామన్నారు. పెంపకందారులు తమకు అందుబాటులో ఉన్న పశు వైద్యశాలలో పందులకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూర్యప్రకాశరావు సూచించారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని మురారి శివారు మామిడి తోటల్లో వెలసిన కనకదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో స్థానిక, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వివిధ వాహనాల్లో కుటుంబ సమేతంగా తరలి వచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో మధ్యాహ్నం భోజనాలు చేసి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. భక్తులు రద్దీ ఎక్కువగా ఉండటంతో తిరునాళ్లను తలపించింది.

ప్రత్తిపాడు ఎస్సై బదిలీ



బదిలీ అయిన ప్రత్తిపాడు ఎస్సై సుధాకర్

ప్రత్తిపాడు: స్థానిక ఎస్సై కె.సుధాకర్ ఏలూరు డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాల రాజు ఆదివారం ఉత్తర్వులు ఇచ్చి నట్టు పోలీసులు తెలిపారు. ఎస్సై కె.సుధాకర్ వీఆర్ నుంచి 2020 అక్టోబర్ 14న బదిలీపై వచ్చి ప్రత్తిపాడు ఎస్సైగా పని చేస్తున్నారు.

మంచు కురిసె.. మనసు మురిసె..



తుని రైల్వే స్టేషన్‌లో కనువిందు చేస్తున్న మంచు దుప్పటి



తుని జాతీయ రహదారిపై ఇలా..

ఏజెన్సీ ప్రాంతాలు, ఎత్తయిన కనుముల్లో సుప్రభాత సమయాన మంచు కురవడంతో ఆకాశం ఆహ్లాదకరంగా కనువిందు చేస్తుంది. ఆ మంచు దుప్పట్లను చూసేందుకు పర్యాటకులు సైతం ఆయా ప్రాంతాలకు తరలివెళతారు. కాగా ఆదే రీతిలో ఆదివారం ఉదయం తుని పట్టణంలో మంచు కురిసింది. జాతీయ రహదారి, పార్కులు, రైల్వే స్టేషన్ ప్రాంతాలను మంచు దుప్పట్లు కప్పేశాయి. ఆ మంచు తెరలను పట్టణవాసులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా తుని మంచు కురిసిందని తుని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. – తుని